దసరా సెలవులు.. సరదాకు నెలవులు

పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించడంతో గురుకులాలు, సంక్షేమ వసతిగృహాలు, ప్రైవేటు హాస్టళ్ల నుంచి విద్యార్థులు మంగళవారం ఇంటి బాట పట్టారు. ఈ నెల 2 నుంచి 14 వరకు సెలవులు ప్రకటించగా 15న పునఃప్రారంభం కానున్నాయి. విద్యార్థులను తల్లిదండ్రులు వాహనాల్లో ఇళ్లకు తీసుకెళ్లారు. పెద్దపల్లి, మంథని, గోదావరిఖని ప్రయాణ ప్రాంగణాలు కిటకిటలాడాయి. -న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్, సుల్తానాబాద్


భూపతిపూర్ బీసీ గురుకులం నుంచి తల్లితో కలిసి వెళ్తున్న విద్యార్థి


ద్విచక్రవాహనంపై కూతురును తీసుకెళ్తున్న తండ్రి



కిటకిటలాడుతున్న పెద్దపల్లి బస్టాండ్


సుల్తానాబాద్: భూపతిపూర్ గురుకులం వద్ద సందడి

మహాత్మా.. మన్నించు..!

కలగానే మీ ఆశయాలు

ఈనాడు, కరీంనగర్



బాపూ జీవితం అన్ని తరాలకు ఆదర్శం. ఆయన మాటలు అనునిత్యం అనుసరణీయం. మహాత్ముడు చూపిన మార్గం శిరోధార్యం. జాతిపితగా.. గాంధీ తాతగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ఆయన కలలు కన్న స్వరాజ్యం ఎలా ఉండాలి..? ప్రస్తుతం ఎలా ఉంటోంది.? అసలు ఆయన చెప్పిందేంటి..? మనం చేస్తున్నదేంటి? ఆచరణలో చూపమన్నదేంటి? మనం అనుసరిస్తున్నదేంటి? స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు వసంతాలు దాటినా.. మహనీయుడి బోధనలు, సూక్తులు.. జీవిత చరిత్రలోని మధురిమలు మాటలకే పరిమితమవుతున్నాయి.. ఆయన మాటల బాటలో మనమే విధంగా పయనిస్తున్నామనేందుకు మచ్చుకు కొన్ని ఇలా..

హత్యలు.. దాడులూ..!



అహింసయే ఆయుధమని గాంధీజీ ఆచరణలో చూపారు. ఆయన మాటలు పెడచెవిన పెడుతూ నేడు పలువురు హింసా మార్గంలో నడుస్తున్నారు. కన్నకొడుకు తల్లిదండ్రులను, భార్య భర్తను హతమార్చే ఉదంతాలు ఉమ్మడి జిల్లాలో నిత్యకృత్యమవుతున్నాయి. క్షణికావేశంలో కోపతాపాల్ని పెంచుకుంటున్నారు. భూతగాదాలకు, ఆర్థిక లావాదేవీలకు గొడవ పడుతూ భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. హత్యలు దోపిడీలు, ఆస్తుల విధ్వంసాలు, భయానక పరిస్థితులు పల్లె, పట్టణాల్లో రోజూ కనిపిస్తున్నాయి. 2023లో 103, ఈ ఏడాదిలో ఇప్పటివరకు 80కిపైగా హత్యలు జరగడం పరిస్థితికి అద్దం పడుతోంది. మాట్లాడుకుంటే ఎన్నో సమస్యలు పరిష్కరించుకోవచ్చు. ఆ దిశగా అందరూ అడుగులు వేయాలి.

అతివకు రక్షణేది?



అర్ధరాత్రి వేళ ఎలాంటి భయం లేకుండా స్త్రీ తిరగగలిగే రోజు రావాలన్నది బాపూ ఆశయం. కానీ ఇందుకు భిన్నంగా ఉమ్మడి జిల్లాలో పరిస్థితులున్నాయి. అతివలపై అఘాయిత్యాల పరంపర పెరుగుతోంది. గృహహింస కేసులు సగటు రోజుకు మూడు నమోదవుతున్నాయి. అత్యాచారాలు, లైంగిక వేధింపులు, అపహరణ కేసులు 2023లో 1,850 నమోదయ్యాయి. చిన్నారులపై అత్యాచారాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సభ్యసమాజం తల దించుకునే విధంగా మహిళలకు ఇంటా బయట ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు చట్టాలు పక్కాగా అమలవ్వాలి. నేరాల అదుపునకు చర్యలుండాలి.

ఊరూరా మద్యం జోరు..




మద్యపాన నిషేధం అటకెక్కింది. పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది. 1,218 గ్రామాల్లో దాదాపుగా 5వేలకుపైగా గొలుసు దుకాణాలు మద్యం అమ్మకాల కోసం పుట్టుకొచ్చాయి. ప్రజల ఆరోగ్యం పాడవటంతోపాటు చిన్న కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. నాలుగు జిల్లాల పరిధిలోని 282 మద్యం దుకాణాల్లో రోజుకు సగటున రూ.8 కోట్ల వ్యాపారం జరుగుతుందంటే మద్యానికి ఎంత బానిసలవుతున్నారో అర్థం చేసుకోవచ్చు. పలు గ్రామాల్లో మద్యపానం తీరుని వ్యతిరేకించిన ఉదంతాలున్నా.. చాలాచోట్ల మాత్రం మందు బాబులు తమ జోరుని ఆపడం లేదు. ఏడాదికి తాగి వాహనాల్ని నడిపే వారిపై 52 వేల కేసులు నమోదవుతున్నాయి.

అవినీతి పాళ్లూ అధికమే..!

ఉమ్మడి జిల్లాలో అవినీతి శాఖోపశాఖలుగా విస్తరిస్తోంది. ఏడాదికి సగటున 15 మంది అధికారులు పనికోసం లంచం తీసుకుంటూ పట్టుబడుతున్నారు. అనధికారికంగా అవినీతి సొమ్ము రోజుకు రూ.లక్షల్లో చేతులు మారుతోంది. నీతి నిజాయతీని మరిచి లంచగొండులుగా మారే వారి సంఖ్య అన్ని కార్యాలయాల్లో కనిపిస్తోంది. పని కావాలంటే పైసలు ముట్టజెప్పాలనే సంస్కృతి నేటి కాలంలో పెరుగుతుండటం గాంధీజీ ఆశయాలకు విరుద్ధం. అవినీతిని అరికట్టే దిశగా కలిసి కట్టుగా ప్రతి ఒక్కరు ఉద్యమించాలి.

'స్వచ్ఛ' బాటలో పౌరస్పృహ పెరగాలి

పరిశుభ్రతే దైవత్వం అన్న మహాత్ముడి ఆశయానికి అనుగుణంగా అడుగులు పడుతున్నా ఇంకా పరిస్థితి పూర్తిగా మారడం లేదు. స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛ దర్పణ్ జాతీయ అవార్డులను పలు పంచాయతీలు, పట్టణాలు అందుకుంటుండగా.. మరోవైపు కొన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్యం కరవై రోగాలు విజృంభిస్తున్నాయి. తడి, పొడి చెత్త సేకరణ మాటలకే పరిమితమవుతోంది. ప్రతి ఒక్కరూ పౌరస్పృహతో పరిశుభ్రత పాటిస్తేనే.. స్థానిక సంస్థలు ఆవైపుగా చర్యలు తీసుకుంటేనే సంపూర్ణ పారిశుద్ధ్యం సాధ్యం.



డీఎస్సీ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు ప్రతిభ కనబరిచారు. సోమవారం 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల జాబితాను విడుదల చేయగా ఉత్తమ ర్యాంకుతో కొలువు ఖాయం చేసుకున్నారు. వారి నేపథ్యంపై కథనం.

ఫిజికల్ సైన్స్‌లో మొదటి ర్యాంకు


దేవేందర్‌రెడ్డి

మంథని గ్రామీణం: ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన శీలం దేవేందర్‌రెడ్డి స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. 2006లో బీఈడీ పూర్తి చేసిన ఆయన కొన్నాళ్లు మంథనిలోని ప్రైవేటు పాఠశాలలో పని చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో పోటీ పరీక్షల శిక్షణ కేంద్రంలో బోధకుడిగా పని చేస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేయడం తన జీవితాశయమని ఆయన పేర్కొన్నారు. దేవేందర్‌రెడ్డిని తల్లిదండ్రులు అశ్వతమ్మ, లింగారెడ్డి, గ్రామస్థులు అభినందించారు.

రెండో ప్రయత్నంలో దరి చేరిన లక్ష్యం


మునేశ్

కాల్వశ్రీరాంపూర్: మల్యాల గ్రామానికి చెందిన గీతకార్మికుడు మోడెం కొమురయ్య కుమారుడు మునేశ్ రెండో ప్రయత్నంలో ప్రభుత్వ కొలువు సాధించారు. 2015లో బీఈడీ పూర్తి చేశారు. తాజా ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ సాంఘికశాస్త్రం విభాగంలో 78 మార్కులతో జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా మిత్రులు, గ్రామస్థులు మునేశ్‌ను అభినందించారు.

సత్తా చాటిన గుంపుల యువకుడు


రాజమౌళి

ఓదెల: గుంపుల గ్రామానికి చెందిన సూత్రాల రాజమౌళి స్కూల్ అసిస్టెంట్ గణితం విభాగంలో 71.57 మార్కులతో జిల్లాలో నాలుగో ర్యాంకు, ఎస్జీటీలో 78.57 మార్కులతో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. 2012-14లో టీటీసీ, 2022లో బీఎడ్ పూర్తి చేశారు. తండ్రి కిష్టయ్య గ్రామంలో సెలూన్ నిర్వహిస్తుండగా, తల్లి పద్మ కూలీ పనులు చేస్తున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన రాజమౌళి ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపిక కావడంతో స్థానికులు అభినందించారు.

లక్ష్యానికి చేరువలో ఎరువుల కర్మాగారం

ఫెర్టిలైజర్ సిటీ, న్యూస్‌టుడే: రామగుండం ఎరువుల కర్మాగారంలో(ఆర్ఎఫ్‌సీఎల్) ఆరునెలల యూరియా ఉత్పత్తి లక్ష్యానికి చేరువయింది. కర్మాగార వార్షిక ఉత్పత్తి లక్ష్యం 12.7 లక్షల మెట్రిక్ టన్నులుకాగా.. ఆరు నెలల లక్ష్యం 6.35 లక్షలు టన్నులు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 6,17,600 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరిగింది. మరో 17,400 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరిగి ఉంటే లక్ష్యాన్ని చేరుకునేది. దీనికి కృషిచేసిన ఉద్యోగులు, అధికారులకు సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్ రాజహంస అభినందనలు తెలిపారు. ఇక్కడి యూరియాను తెలంగాణకు 2,16,036 మెట్రిక్ టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 56,481, కర్ణాటకకు 1,33,897, మహారాష్ట్రకు 66,436, ఛత్తీస్‌గఢ్‌కు 43,869, తమిళనాడుకు 46,529, మధ్యప్రదేశ్‌కు 54,349 మెట్రిక్ టన్నుల యూరియాను రామగుండం ఎరువుల కర్మాగారం సరఫరా చేసింది.

మాయమాటల పేరిట ప్రభుత్వ దగా

భారాస ఆందోళనలో మాజీ మంత్రి ఈశ్వర్


ర్యాలీగా కలెక్టరేట్‌కు వస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు చందర్, మనోహర్‌రెడ్డి, జడ్పీ మాజీ ఛైర్మన్ మధూకర్, భారాస నాయకులు

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరిట దగా చేస్తోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. రైతులందరికీ పంట రుణమాఫీ వర్తింపు, ఇతర సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం భారాస ఆధ్వర్యంలో పెద్దపల్లిలోని రంగంపల్లి పెట్రోల్ బంక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద మాజీ మంత్రి మాట్లాడుతూ భారాస పదేళ్ల పాలనలో రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉంటే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. జడ్పీ మాజీ ఛైర్మన్ పుట్ట మధూకర్ మాట్లాడుతూ సీఎం ప్రజా సమస్యలు గాలికొదిలేసి ముడుపులు ఇచ్చేందుకు తరచూ దిల్లీకి వెళ్తున్నారని విమర్శించారు. రుణమాఫీపై ప్రమాణాలు పక్కన పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు క్షమించబోరని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. అమలుకు నోచని హామీలతో కాలయాపన చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆరోపించారు. అనంతరం అదనపు కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ రఘువీర్‌సింగ్, భారాస నాయకులు, రైతులు పాల్గొన్నారు.

3 నుంచి కుటుంబ డిజిటల్ కార్డు సర్వే

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈ నెల 3 నుంచి కుటుంబ డిజిటల్ కార్డుల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. మంగళవారం ఆయన సంబంధిత అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గానికి రెండు ప్రాంతాలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేయాలని సూచించారు. పెద్దపల్లి మున్సిపాలిటీలో ఒక వార్డు, సుల్తానాబాద్ మండలంలో ఒక గ్రామం, రామగుండం పరిధిలో నగరపాలికలో ఒక డివిజన్, పాలకుర్తి మండలంలో ఒక గ్రామం, మంథని నియోజకవర్గ కేంద్రంలో ఒక వార్డు, ముత్తారం మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేయాలని ఆదేశించారు.

కార్యకలాపాలు నిలిపివేయండి!

డీసీఎంఎస్ పాలకవర్గానికి తాఖీదులు?

ఈనాడు, కరీంనగర్

ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ పాలకవర్గ కార్యకలాపాలు తక్షణమే నిలిపి వేయాల్సిందిగా సహకారశాఖ ఉన్నతాధికారులు తాఖీదులు జారీ చేసినట్లు తెలిసింది. సరైన కోరం లేకపోవడంతో ఇక మీదట ఆర్థిక లావాదేవీల నిర్వహణ సహా పాలనాపరంగా ఎటువంటి నిర్ణయాలు తీసుకోకూడదనే ఆదేశాలిచ్చినట్లు సమాచారం. సుమారు నాలుగేళ్ల కిందట 10 మంది డైరెక్టర్లతో కూడిన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా ధర్మపురి పీఏసీఎస్ ఛైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి ఎన్నికవగా.. వైస్ ఛైర్మన్‌గా కొత్తపల్లి వినియోగదారుల సంఘం ఛైర్మన్‌గా ఉన్న ఫక్రొద్దీన్ ఎన్నికయ్యారు. పాలకవర్గంలో మెజారిటీ డైరెక్టర్లంతా భారాస పార్టీ మద్దతుదారులే. వీరంతా 2020 ఫిబ్రవరి 28న పదవి బాధ్యతల్ని చేపట్టారు. డీసీఎంఎస్ పరిధిలోని పలు అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యమయ్యారు.

సరైన కోరం లేక..

ప్రస్తుతం ఈ సొసైటీ పాలకవర్గం మనుగడకు అవసరమైన కోరం లేకపోవడంతో సహకార శాఖ ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చర్చ జరుగుతోంది. కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లోని ఎంపిక చేసిన కొన్ని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఛైర్మన్లు ఇందులో డైరెక్టర్లుగా ఉన్నారు. అప్పట్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎంపిక విషయంలో రాజకీయంగా తర్జనభర్జన జరిగింది. భారాసలోనే పలువురు ఈ స్థానం కోసం పోటీ పడ్డారు. ఎట్టకేలకు అధిష్ఠానం ఆదేశాలతో శ్రీకాంత్‌రెడ్డికి ఛైర్మన్‌గా అవకాశాన్ని కల్పించారు. రామడుగు పీఏసీఎస్ ఛైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు ఛైర్మన్ గిరికి పోటీ పడ్డారు. ఆ సమయంలో ఆయన్ని సముదాయించి కొన్నేళ్ల తరువాత ఇస్తారనే మాటలు వినిపించాయి. ఇటీవల కొన్నాళ్లుగా రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ సొసైటీలోని డైరెక్టర్లుగా ఉన్న పీఏసీఎస్ ఛైర్మన్లు కొందరు వివిధ కారణాలతో ఆ పదవి నుంచి వైదొలిగారు. అవిశ్వాస తీర్మానం కారణంగా నుస్తులాపూర్ (కరీంనగర్ జిల్లా), నర్సింగపూర్ (రాజన్న సిరిసిల్ల జిల్లా) ఛైర్మన్‌లతోపాటు మరికొందరు వారి పదవిని కోల్పోయారు. ఒక డైరెక్టరు మరణించారు. మరో డైరెక్టరు వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారు. ఇలా ఒక్కొక్కరు దూరమవగా.. ప్రస్తుత పాలకవర్గంలో ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లతో కలిపి కేవలం నలుగురే మిగిలారు. దీంతో సహకార శాఖ నిబంధనల ప్రకారం సరైన కోరం లేనందున ఈ పాలకవర్గం సమావేశాలు నిర్వహించొద్దని తేల్చిచెప్పినట్లు సమాచారం.

మాజీ ఎమ్మెల్యే విగ్రహ ఏర్పాటుకు కృషి

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు విగ్రహాన్ని సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు తెలిపారు. మంగళవారం రాజమల్లు జయంతిని పురస్కరించుకొని సుల్తానాబాద్‌లోని ఆయన నివాసంలో చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. పుర పారిశుద్ధ్య కార్మికులకు కుటుంబ సభ్యులు సమకూర్చిన దుస్తులను పంపిణీ చేశారు. పూసాల రోడ్డులో కాంగ్రెస్ నాయకులు బిరుదు చిత్రపటానికి నివాళి అర్పించారు. పుర ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, వైస్ ఛైర్‌పర్సన్ బిరుదు సమత, కౌన్సిలర్లు, పెద్దపల్లి ఏఎంసీ ఛైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పూల జాతర.. సాగేను జోరుగా

బతుకమ్మ పండుగను పురస్కరించుకొని గోదావరిఖనిలోని ప్రధాన వ్యాపార కేంద్రంలో మంగళవారం రాత్రి పూల సందడి నెలకొంది. వివిధ రంగుల బంతిపూలతోపాటు గునుగు, తంగేడు, సీతమ్మజడ, చేమంతి, గుమ్మడి తదితర పూల విక్రయాలు జోరుగా సాగాయి. ప్రధాన కూడలిలో నలు దిక్కుల రహదారుల నడుమ కుప్పలుగా పోసి విక్రయాలు సాగిస్తున్నారు. పరిసర గ్రామాలకు చెందినవారు అధిక సంఖ్యలో విక్రయాలు సాగించగా.. నగర మహిళలతో తీవ్ర రద్దీ నెలకొంది. - న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం


గోదావరిఖని మార్కెట్‌లో పూల దుకాణాలు

వృద్ధుల అనుభవాలే నేటి తరానికి పాఠాలు

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: వృద్ధుల అనుభవాలను నేటి తరం పాఠాలుగా తీసుకోవాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం సమీకృత పాలనా ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వృద్ధులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా వృద్ధుల చట్టాలు, సమస్యల పరిష్కారంపై పలువురు అభిప్రాయాలు వెల్లడించారు. అనంతరం వృద్ధులను సన్మానించారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ, జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్ ఖాన్ పాల్గొన్నారు.


వృద్ధుడిని సన్మానిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ అరుణశ్రీ, అధికారులు

ప్రభుత్వ ఆస్పత్రిలో కార్పొరేట్ సేవలు

పెద్దపల్లి: జిల్లా ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయి సేవలందిస్తున్నట్లు కలెక్టర్ శ్రీహర్ష వెల్లడించారు. పెద్దపల్లి మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నెలలో 203 ప్రసవాలు జరిగాయన్నారు. గైనిక్ సేవలే కాకుండా మరో 39 మేజర్ సర్జరీలు జరిగాయన్నారు. ఈ సందర్భంగా సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. డీసీహెచ్ శ్రీధర్, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, ఆర్ఎంవో రవీందర్, సీనియర్ వైద్యులు వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

ప్రసూతి ఐసీయూ ఏర్పాటుకు సన్నాహాలు

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

గర్భిణులు, బాలింతలకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం కేవలం ఐదు పడకల సామర్థ్యంతోనున్న ఎంఐసీయూ సరిపోవడం లేదు. ఆసుపత్రిలోని నూతన భవనంలో 'ఐసీయూ' ఉన్నప్పటికీ.. ప్రసూతి విభాగం పాత భవనంలో ఉంది. దీంతో నూతన భవనంలోని ఐసీయూలో గర్భిణులకు వైద్య సేవలందించే పరిస్థితుల్లేవు. ఈ క్రమంలో గర్భిణుల కోసం అత్యాధునిక వసతులతో పాత భవనంలో ప్రత్యేకంగా ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ) ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

విస్తరించనున్న లేబర్ గది..

ఆసుపత్రి పాత భవనంలో గతంలో రక్తశుద్ధి కేంద్రం నిర్వహించిన ఆవరణలో ఐసీయూ ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. ప్రస్తుతం గ్రౌండ్ ఫ్లోర్‌లోని సహజ ప్రసవాల విభాగం(లేబర్ గది)లో కేవలం రెండు పడకలు మాత్రమే ఉన్నాయి. దీంతో ఏకకాలంలో సహజ ప్రసవానికి గర్భిణుల సంఖ్య పెరిగినప్పుడు ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఎంఐసీయూ వార్డులో ప్రసవం జరిపించాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో లేబర్ గదిని విస్తరించాల్సి ఉంది. ప్రస్తుతం ఆసుపత్రిలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఐదు పడకల సామర్థ్యంతోనున్న ఎంఐసీయూ (మెటర్నిటీ ఐసీయూ)లోకి.. లేబర్ గదిని తరలించినట్లయితే ఏకకాలంలో ఐదుగురికి సహజ ప్రసవాలు చేసే అవకాశముంటుంది.

తగ్గిన ప్రసవాలు..

గతంలో ప్రాంతీయ ఆసుపత్రి స్థాయిలోనే సుమారు 400 ప్రసవాలతో రాష్ట్రస్థాయి రికార్డు సృష్టించింది. అయితే సార్వజనిక ఆసుపత్రిగా స్థాయి పెరిగాక ప్రసవాల సంఖ్య సగానికి పడిపోయింది. గతంలో కేవలం గోదావరిఖని ఆసుపత్రిలోనే ప్రసవాలు జరుగుతుండటంతో.. పెద్దపల్లి, మంథని, చెన్నూరు తదితర ప్రాంతాల నుంచి గర్భిణులు ప్రసవం కోసం ఇక్కడికి వస్తుండేవారు. ప్రస్తుతం పెద్దపల్లి, మంథని, మంచిర్యాలలో మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో అత్యాధునిక వసతులతో ప్రసవాలు చేస్తుండటంతో.. ఇక్కడికి వచ్చే పరిస్థితులు కనిపించటం లేదు. అయితే గతంలో లేని విధంగా గోదావరిఖని ఆసుపత్రిలో క్లిష్టమైన శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు.

ఖని ఆసుపత్రిలో క్లిష్టమైన శస్త్ర చికిత్సలు



ఆసుపత్రిలోని సహజ ప్రసవాల విభాగం

గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలి

సార్వజనిక ఆసుపత్రిలో ప్రసూతి సేవలను మరింత మెరుగుపరచాలనే లక్ష్యంతో అత్యాధునిక వసతులతో ప్రత్యేక ఐసీయూకు ఏర్పాట్లు చేస్తున్నాం. లేబర్ గది విస్తరణతో సహజ ప్రసవాలకు సైతం ఎలాంటి ఇబ్బందులుండవు. మహిళలకు క్లిష్టమైన శస్త్ర చికిత్సలను సైతం విజయవంతంగా నిర్వహిస్తున్నాం. కార్పొరేట్ తరహాలో సదుపాయాలున్న గోదావరిఖని ఆసుపత్రి సేవలను గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ హిమబిందుసింగ్, ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్య కళాశాల

డీజే, డ్రోన్‌ల నిషేధాజ్ఞల పొడిగింపు

గోదావరిఖని, న్యూస్‌టుడే: కమిషనరేట్ పరిధిలో డీజేలు, డ్రోన్‌లపై ఉన్న నిషేధాజ్ఞలను నవంబరు 1 వరకు పొడిగించినట్లు సీపీ శ్రీనివాస్ వెల్లడించారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. డ్రోన్ కెమెరాలతో అనుమతి లేకుండా చిత్రీకరించకూడదని స్పష్టం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 4 PM)
గోదావరిఖని : 80085 73573
పెద్దపల్లి : 80085 73542
మంథని : 99122 68471

న్యూస్‌టుడే, ముత్తారం

? ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉంది. వాహనదారులను, పిల్లలను గాయపరుస్తున్నాయి.
-వైకుంఠం, గ్రామస్థుడు

✔ ఈ సమస్య అన్ని గ్రామాల్లో ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.
-ఎంపీడీవో సురేశ్

న్యూస్‌టుడే, పాలకుర్తి

? పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. - కాలనీవాసులు

✔ త్వరలో సమస్యను పరిష్కరిస్తాం. -నారాయణ, పంచాయతీ కార్యదర్శి

వీధి దీపానికి మరమ్మతు

ఈనాడు స్పందనకు వందనం

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: 'మేమున్నాం.. మీకు తోడుగా...' శీర్షికన 'ఈనాడు-పెద్దపల్లి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి నగరపాలక ఏఈ రాంజీ స్పందించారు. ఎన్టీపీసీ భద్రయ్య హోటల్ ఎదురు గల్లీలోని వీధి దీపానికి మరమ్మతులు చేయడంతో అంధకారం తొలగినట్లయింది.

సమస్యలు పక్కదారి పట్టించడానికే హై'డ్రామా'

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమస్యలను పక్కదారి పట్టించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరిట డ్రామా చేస్తోందని భాజపా నేతలు ఆరోపించారు. మంగళవారం పెద్దపల్లిలో మంగళవారం నిర్వహించిన పార్టీ జిల్లా స్థాయి సమీక్షలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రదీప్‌రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్.కుమార్, జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డిలు మాట్లాడారు. జిల్లాలో రెండో విడతలో 80 వేల సభ్యత్వ నమోదు చేయాలన్నారు. కందుల సంధ్యారాణి, లావణ్య, పోషం, వెంకటరమణ, సంపత్‌రావు పాల్గొన్నారు.

పండుగలకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: సద్దుల బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా సుల్తానాబాద్ పట్టణంలోని అన్ని వార్డుల్లో ఏర్పాట్లు చేస్తున్నట్లు పుర ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన కౌన్సిల్ అత్యవసర సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు. వైస్ ఛైర్‌పర్సన్ సమత, కౌన్సిలర్లు, ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం



గోదావరిఖని: సింగరేణి వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో ఆర్జీ-1, 2 డివిజన్ల బాస్కెట్‌బాల్ పోటీలను పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడా నైపుణ్యం పెంపొందించుకుని కోల్ ఇండియా స్థాయిలో పతకాలు సాధించాలన్నారు. క్రీడా గౌరవ కార్యదర్శి సారంగపాణి, సీఎంవోఏఐ ప్రతినిధి క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి


ఖని: మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని, న్యూస్‌టుడే: నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు సమిష్టిగా కృషి చేయాలని ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ సూచించారు. స్థానిక జీఎం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సెప్టెంబరులో ఆర్జీ-1 ప్రాంతంలో 82 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామన్నారు. గత ఆరు నెలల్లో 86 శాతం బొగ్గు ఉత్పత్తి చేపట్టామన్నారు. జీడీకే-11 గనిలోని రెండు కంటిన్యూస్‌మైనర్ యంత్రాల ద్వారా 75 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించాయని.. జీడీకే-1, 2, 2-ఏ గనుల్లో అతి తక్కువగా బొగ్గు ఉత్పత్తి జరిగిందన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ఆర్జీ-2 డివిజన్‌లో సెప్టెంబర్‌లో 59శాతం బొగ్గును ఉత్పత్తి చేశామని జీఎం సూర్యనారాయణ అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఉత్పత్తి వివరాలను ఆయన వెల్లడించారు. గత ఆరు మాసాల్లో 36 లక్షల టన్నులకుగాను.. 39లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేశామన్నారు. గనుల వారీగా గత నెలలో ఓసీపీ-3లో 58శాతం, వకీలుపల్లెగనిలో 93శాతం బొగ్గును వెలికితీశామన్నారు. ఎస్‌వోటూ జీఎం సంతోష్‌కుమార్, అధికారప్రతినిధి అనిల్‌కుమార్, ఐఇడి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): సెప్టెంబర్ నెలలో బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మొత్తం 4.74 లక్షల టన్నుల లక్ష్యానికి 3.99 లక్షల టన్నుల(84 శాతం) ఉత్పత్తి, 38.30 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీతకు 30.29 లక్షల క్యూబిక్ మీటర్లు(79 శాతం) సాధించామన్నారు. 5.14 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశామన్నారు. ఓసీపీ-1 గనికి నిర్దేశించిన 2.74 లక్షల టన్నుల లక్ష్యానికి 2.21 లక్షల టన్నులు(81 శాతం), ఓసీపీ-2 గనికి నిర్దేశించిన 2 లక్షల టన్నుల లక్ష్యానికి 1.78 లక్షల టన్నులు(89 శాతం) బొగ్గు ఉత్పత్తి చేశామన్నారు.

ఏఎల్‌పీలో 76 శాతం..

అడ్రియాల ప్రాజెక్టు ఏరియాకు సంబంధించి బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను జీఎం వెంకటేశ్వర్లు వెల్లడించారు. సెప్టెంబర్‌లో నిర్దేశించిన 0.17 లక్షల టన్నుల లక్ష్యానికి 0.13 లక్షల టన్నులు (76 శాతం) ఉత్పత్తి, 0.16 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశామన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


రిబ్బన్ కత్తిరిస్తున్న సేవా అధ్యక్షురాలు అనిత

గోదావరిఖని, న్యూస్‌టుడే: మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు నిర్వహించే వివిధ వృత్తి శిక్షణ తరగతులను సేవా అధ్యక్షురాలు అనిత మంగళవారం ప్రారంభించారు. సింగరేణి ఆర్జీ-1 సేవా భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టైలరింగ్‌తోపాటు మగ్గంవర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు సంబంధించిన తరగతులను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. మార్కెట్‌లో ఉన్న అవకాశాలకు అనుగుణంగా కోర్సులను ఏర్పాటుచేశామని.. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమితి కోఆర్డినేటర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై రాజకీయ ఒత్తిడి

గోదావరిఖని: సింగరేణిలోని నిజాయితీ అధికారులపై రాజకీయ ఒత్తిడి పెంచుతున్నారని ఏఐటీయూసీ నాయకులు సీతారామయ్య, రాజ్‌కుమార్ ఆరోపించారు. సింగరేణికి చెందిన ఓ టెండర్ విషయంలో సంతకం చేయనందుకు ఆ పదవీ నుంచి అధికారిని తప్పించారని ఆరోపించారు. గోదావరిఖనిలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. నాయకులు వైవి.రావు, సారయ్య, స్వామి, పోశం తదితరులున్నారు.

జీఎంల పాఠశాల సందర్శన

యైటింక్లయిన్‌కాలనీ: కాలనీలోని సెక్టార్-3 సింగరేణి పాఠశాలను మంగళవారం జీఎంలు నికోలాస్, ఫీట్జ్రాల్డ్, జేసురత్నంలు సందర్శించారు. సెక్టార్-3 పాఠశాలలో ప్రారంభించనున్న సీబీఎస్ఈ సిలబస్ ఏర్పాట్లను వారు పర్యవేక్షించారు. విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, కంప్యూటర్స్ డిజిటల్ ల్యాబ్ తదితర సమకూర్చే తీరును పరిశీలించారు.

సమస్యలపై ఎస్‌వోటూ జీఎంకు వినతి


వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: కారుణ్య ఉద్యోగం దరఖాస్తు చేస్తే వివిధ కారణాలతో విజిలెన్స్ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ ఆర్జీ-3కి చెందిన మెడికల్ అన్‌ఫిట్ బాధితులు మంగళవారం జీఎం కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సంస్థలో 30 ఏళ్ల సర్వీసు పూర్తి చేసి అనారోగ్య కారణాలతో మెడికల్ అన్‌ఫిట్ అయితే మారు పేర్లతో ఉద్యోగం చేశారని, రెండు పేర్లున్నాయంటూ కొర్రీలు పెడుతున్నారని ఆరోపించారు. అనంతరం ఎస్‌వోటూ జీఎం రఘుపతికి వినతిపత్రం అందజేశారు. బాధితులు వెంకటేశ్, హరీశ్, బాలకృష్ణ, సుధాకర్, అరుణ్ పాల్గొన్నారు.

లాభాల వాటాపై తప్పుడు ప్రచారం

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: లాభాల వాటాపై కొన్ని కార్మిక సంఘాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఏఐటీయూసీ సీనియర్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సారయ్య, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీరావు, సెంట్రల్ సెక్రెటరీ జూపాక రాంచందర్ ఆరోపించారు. మంగళవారం అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో పిట్ సెక్రెటరీ గంగాధర్ ఆధ్వర్యంలో ఆర్జీ-3 బ్రాంచి సెక్రెటరీ ఎమ్మార్సీరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ లాభాల్లో 33 శాతం ఇప్పించామన్నారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.5 వేల చొప్పున ఇప్పించిన ఘనత తమదేనన్నారు. సహాయ బ్రాంచ్ సెక్రెటరీ డీటీరావు, సహాయ పిట్ సెక్రెటరీ కుమార్, ఆర్జీ-3 ఏరియా వైస్ ప్రెసిడెంట్ సమ్మయ్య, నాయకులు కిరణ్ కుమార్, సలీం పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ఆర్జిత లాభాల్లో కార్మికులకు వాటా తీసుకువచ్చిన సంఘం ఏఐటీయూసీ అని యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆర్జీ-2 డివిజన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని సంఘాలు లాభాల వాటా తమ విజయంగా ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. నాయకులు రవీందర్, రాజరత్నం, అన్నారావు తదితరులు పాల్గొన్నారు.

చర్చలు సఫలం.. స్థానికులకే ఉద్యోగాలు

గోదావరిఖని: ఓసీపీ-5 ఓబీ కంపెనీలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలనే డిమాండ్ మేరకు మంగళవారం జరిగిన చర్చలు ఫలించాయి. పీసీ పటేల్ కంపెనీ ప్రతినిధులతో జీఎం లలిత్‌కుమార్ సమక్షంలో చర్చలు జరిగాయి. ఈ మేరకు పీసీ పటేల్ కంపెనీ అధికారులు అంగీకారానికి రావడంతో తిరిగి పనులు ప్రారంభించారు.

ముందస్తు బతుకమ్మ సంబరాలు


పవర్‌హౌస్‌కాలనీలో రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలి


పెద్దపల్లి గాయత్రి విద్యానికేతన్‌లో..


సుల్తానాబాద్ ఆల్ఫోర్స్ పాఠశాలలో..


ఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...


జీడీనగర్‌లోని యూనివర్సల్ పాఠశాలలో

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయినులు వివిధ రకాల పూలతో బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు.

-న్యూస్‌టుడే, యంత్రాంగం


ట్రినిటీలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు


ధర్మారంలో బతుకమ్మల వద్ద..


జూలపల్లిలో..


ఎల్కలపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో..

ప్రజల సహకారంతోనే స్వచ్ఛ పట్టణం


జెండాకూడలిలో ఫ్లాష్‌మాబ్ చేస్తున్న విద్యార్థులు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పట్టణ ప్రజల సహకారంతోనే స్వచ్ఛత సాకారమవుతుందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ మమతారెడ్డి పేర్కొన్నారు. పెద్దపల్లి పురపాలిక ఆధ్వర్యంలో స్వచ్ఛసర్వేక్షణ్-2024 స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం జెండాకూడలిలో విద్యార్థులతో ఫ్లాష్ మాబ్ నిర్వహించారు.

నల్లబ్యాడ్జీలతో ఏఈవోల నిరసన

పెద్దపల్లి: పని భారాన్ని తగ్గించాలని కోరుతూ మండలంలోని వ్యవసాయ విస్తరణ అధికారులు మంగళవారం నిరసన తెలిపారు. రాఘవపూర్ రైతువేదిక రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌కు నల్లబ్యాడ్జీలు ధరించి హాజరయ్యారు.

మాజీ ఎమ్మెల్యే జయంతి వేడుకలు

పెద్దపల్లి: మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు జయంతి సందర్భంగా మంగళవారం పెద్దపల్లి అయ్యప్ప కూడలిలో కాంగ్రెస్ నాయకులు కేకు కోశారు. మస్రత్, శ్రీనివాస్, గోపగాని సారయ్య, ఉప్పు రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నేడు మంథనిలో మంత్రి పర్యటన

మంథని, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు బుధవారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మహదేవపూర్, కాటారం మండలాల్లో పర్యటన అనంతరం మధ్యాహ్నం 1 గంటకు మంథనిలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పోషణ్ మహ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం విలోచవరంలో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంథని, న్యూస్‌టుడే: మంథని ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శారద తెలిపారు. కర్ణాటక గాత్రం, పేరిణినాట్యం సర్టిఫికెట్, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు 2024 అక్టోబర్ 31 వరకు 10 సంవత్సరాలు నిండిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మండలి ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకోవాలి

మంథని: ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు బండారి రాజ్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన మంథనిలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోరమ్ ఏర్పాటు చేశామని, నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలోని 42 శాసనసభ నియోజకవర్గాల్లో కో ఆర్డినేటర్లను నియమించామన్నారు.

పంచాయతీలో ఆకస్మిక తనిఖీ

మంథని గ్రామీణం, న్యూస్‌టుడే: డివిజనల్ పంచాయతీ అధికారి కొమ్మెర సతీష్ మంగళవారం చిల్లపల్లి పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి కార్యదర్శికి సూచనలు చేశారు. ఈ నెల 15లోగా 100 శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని కార్యదర్శిని ఆదేశించారు.

కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ

పాలకుర్తి: కాటమయ్య రక్షణ కిట్లను కుక్కలగూడూరులోని గీతా కార్మికులకు ఎమ్మెల్యే సతీమణి మనాలిఠాకూర్, ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి మంగళవారం పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు

యైటింక్లయిన్‌కాలనీ: 16, 17, 18 డివిజన్లలో మంగళవారం భాజపా సభ్యత్వ నమోదు చేపట్టారు. షిర్కే బస్టాండ్ ఏరియాలో నిర్వహించిన కార్యక్రమాన్ని దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివాజీ ప్రారంభించారు.

మహిళలకు భద్రత కల్పించాలి

గోదావరిఖని, న్యూస్‌టుడే: మహిళలపై జరుగుతున్న దాడుల నుంచి భద్రత కల్పించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. గోదావరిఖనిలోని శ్రామికభవన్‌లో మంగళవారం ఐద్వా జిల్లా మూడో మహాసభలు నిర్వహించారు. సీతారాం ఏచూరి, మల్లు స్వరాజ్యం చిత్రపటాలకు నివాళులర్పించి.. అనంతరం ఆమె మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, మహేశ్వరీ పాల్గొన్నారు.

ఖాదీమేళా ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ: కాలనీలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో మంగళవారం ఖాదీమేళాను ఏఐటీయూసీ ఆర్జీ-2 నాయకులు రవీందర్ ప్రారంభించారు. కార్మికులకు నాణ్యమైన చేనేత వస్త్రాలను తక్కువ ధరకే విక్రయించడానికి ఈ మేళా నిర్వహిస్తున్నామన్నారు.

పాఠశాలలను పర్యవేక్షించండి

మార్కండేయకాలనీ: దసరా సెలవులు ప్రకటించడంతో రామగుండం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ, పెట్రోలింగ్ చేపట్టాలని మంగళవారం డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) నాయకులు గోదావరిఖని ఏసీపీ రమేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఇటీవల ప్రభుత్వ బడుల్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి సామగ్రి ధ్వంసం చేశారని గుర్తుచేశారు. కమిటీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు పదోన్నతి

పాలకుర్తి: కేశోరాం కర్మాగారంలో పనిచేస్తున్న పలువురు శాశ్వత కార్మికులుగా పదోన్నతి పొందగా మంగళవారం పదోన్నతి పత్రాలను అందజేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ మహేష్, హెచ్ఆర్ అధికారి సదానందం పాల్గొన్నారు. మరోవైపు దీపావళి బోనస్‌ను పండుగకు 15 రోజుల ముందుగా అందించాలని గుర్తింపు సంఘం అధ్యక్షుడు మనోహర్ రెడ్డి మేనేజర్‌కు వినతిపత్రం అందించారు.

నేర వార్తలు

వివాహిత బలవన్మరణం

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల ఎలుకబావివాడలో మంగళవారం రాపల్లి సౌమ్య (25) బలవన్మరణానికి పాల్పడింది. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన సౌమ్యకు నాలుగేళ్ల క్రితం ఎలుకబావివాడకు చెందిన రాజేశ్‌తో వివాహం జరిగింది. మధ్యాహ్నం ఇంట్లో సౌమ్య ఉరేసుకుంది. తన ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. సౌమ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

రెండున్నరేళ్ల జైలుశిక్ష

గోదావరిఖని: మహిళపై నాలుగేళ్ల క్రితం అత్యాచారయత్నానికి పాల్పడిన యువకుడికి రెండున్నర ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక తిరుమలనగర్‌కు చెందిన మహిళపై 2020, ఫిబ్రవరి 2న బొద్దుల కిరణ్(26) అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఒకటో పట్టణ సీఐ మహేందర్ కేసు నమోదు చేశారు. మంగళవారం సాక్షులను ప్రవేశపెట్టగా గోదావరిఖని జిల్లా అదనపు జడ్జి శ్రీనివాసరావు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

మైనింగ్ అధికారినంటూ వసూళ్లు.. వ్యక్తిపై కేసు

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: మైనింగ్ అధికారిని అని చెప్పి ఇసుక లారీల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడిన వ్యక్తిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేటకు చెందిన పురుషోత్తం సతీశ్ మంగళవారం సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి వద్ద రాజీవ్ రహదారిపై కాళేశ్వరం నుంచి కరీంనగర్ వైపునకు వెళ్తున్న ఇసుక లారీలను ఆపాడు. ఇసుక రవాణాకు సంబంధించి సరైన డీడీలు లేవని, అధిక లోడ్ ఉందంటూ డబ్బు వసూలు చేశాడు. అనుమానం వచ్చిన లారీ డ్రైవర్లు పెద్దపల్లి మైనింగ్ ఏడీ శ్రీనివాస్‌కు సమాచారం ఇవ్వగా ఆయన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని నిలదీయడంతో వాస్తవం వెల్లడైంది. మైనింగ్ ఏడీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఈతచెట్టు పై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

ఓదెల, న్యూస్‌టుడే: ఈత చెట్టు పైనుంచి జారిపడి గీతకార్మికునికి గాయాలైన ఘటన ఓదెల మండలంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం పొత్కపల్లికి చెందిన నాగపురి శ్రీనివాస్‌గౌడ్ చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకు తెగి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అతడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం నాయకులు కోరుతున్నారు.

గంజాయి పట్టివేత


ముదిగొండ, న్యూస్‌టుడే : పెద్దపల్లి జిల్లా పాలకుర్తి గ్రామానికి చెందిన అడపా అరుణ్‌కుమార్ అనే వ్యక్తి నుంచి అయిదు కిలోల ఎండు గంజాయిని మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు నేలకొండపల్లి ఆబ్కారీ సీఐ జగన్నాథరావు తెలిపారు. ఏపీలోని చట్టి నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తూ ఖమ్మం జిల్లా ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో నిందితుడు పట్టుబడినట్టు వివరించారు.

ఎన్టీపీసీకి అవార్డుల పంట

పలు రాష్ట్రాల పరిశ్రమలతో పోటీపడి విజేతగా..



ఎన్టీపీసీ సోలార్ ప్లాంటు అంతర్జాతీయ ఎనర్జీ అవార్డును స్వీకరిస్తున్న ఈడీ కేదార్ రంజన్‌పాండు



ఎన్టీపీసీ రామగుండం పవర్ ప్లాంటు

న్యూస్‌టుడే, జ్యోతినగర్(మార్కండేయకాలనీ)

ఎన్టీపీసీ రామగుండానికి అవార్డుల పంట పడింది. పరిశ్రమలు ఉన్నత స్థానాల్లో నిలవాలంటే అధికారి మొదలు కార్మికుల వరకు అంకిత భావంతో పనిచేస్తేనే సంస్థ అభివృద్ధి పథంలో నడుస్తోంది. దీనికి అనుగుణంగానే ఎన్టీపీసీ ఉన్నతికి ఉద్యోగులు పాటుపడుతున్నారు. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలో గత 8 నెలల వ్యవధిలో ఎన్టీపీసీ 9 అవార్డులు కైవసం చేసుకుంది. ఇతర రాష్ట్రాల పరిశ్రమలతో పోటీపడి ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచింది.

సాధించిన అవార్డులు..

- న్యూదిల్లీలో జరిగిన ఎకనామిక్ టైమ్స్ ఎనర్జీ లీడర్‌షిప్ 2024 అవార్డు ప్రదానోత్సవంలో ఎన్టీపీసీ రామగుండానికి ఎనర్జీ కన్జర్వేషన్ ఇండస్ట్రీస్ అవార్డు దక్కింది. పవర్ ఎక్సలెన్స్‌లో విజయం సాధించినందుకు, ఇంధన రంగాల్లో ముందుంటూ సంస్థ అభివృద్ధికి కృషి చేసినందుకుగాను.. ఈ అవార్డును కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి సెప్టెంబరు 26న అందజేశారు.
- పలు రాష్ట్రాలతో పోటీపడి కొత్త ఆవిష్కరణలు, నూతన అంశాలను వివరిస్తూ.. ఇంధన అభివృద్ధికి కృషి చేసినందుకుగాను పవర్ విభాగంలో ఎనర్జీ కంపెనీ అవార్డును రామగుండం ఎన్టీపీసీ కైవసం చేసుకుంది.
- కోజికోడ్‌లోని తాజ్‌గేట్‌వేలో ఇటీవల నిర్వహించిన జాతీయ అవార్డు ప్రదానోత్సవంలో మూడు బంగారు, రెండు కాంస్య అవార్డులు సైతం దక్కించుకుంది. ఆగస్టు 25న ఎన్టీపీసీ రామగుండం పరిధిలోని గ్రామీణ క్రీడల నైపుణ్యం, సామాజిక అవగాహన యాడ్ ఫిల్మ్, హెచ్‌ఆర్ వైవిధ్యం, ప్రజా అధారిత అభ్యాసాలు, సీఎస్‌ఆర్ ఆవిష్కరణలో సత్తాచాటినందుకు అవార్డులు కైవసం చేసుకుంది.
- ఎన్టీపీసీ రామగుండం సోలార్ ప్లాంటుకు మార్చి 15న అంతర్జాతీయ ఎనర్జీ అవార్డు దక్కింది. ఇటీవల హైదరాబాద్‌లోని సౌర ఎనర్జీ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో నీటిలో తేలియాడే అతిపెద్ద సోలార్ ప్లాంటు విద్యుత్తు ఉత్పత్తి నిర్వహణపై సౌర ట్రయిల్ బ్లైజర్స్ అవార్డుతోపాటు.. ఎన్టీపీసీ రిజర్వాయర్‌లోని 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటుకు ఈ అవార్డు లభించింది.
- ఆరో జాతీయ ఎనర్జీ సమితి ఆధ్వర్యంలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో ఎన్టీపీసీ రామగుండంలోని 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు.. ఫిబ్రవరి29న 'సస్టెయినబుల్ అండ్ రెజిలియెంట్ ఎనర్జీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(ఎస్‌ఆర్‌ఈఐ) అవార్డు కైవసం చేసుకుంది. మే 23న పీఎంఐ వేదికపై ఇటీవల జరిగిన పవర్ క్విజ్ పోటీల్లో ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ప్రాజెక్టులు విజేతలుగా నిలిచి అవార్డు, బహుమతి పొందారు.




జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న జట్టు(పాత చిత్రం)

క్రీడా మెరుపులు

బాస్కెట్‌బాల్ జాతీయస్థాయి పోటీలకు జగిత్యాల విద్యార్థులు

న్యూస్‌టుడే, జగిత్యాల క్రీడావిభాగం



జగిత్యాలకు చెందిన పలువురు విద్యార్థులు బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. చదువును నిర్లక్ష్యం చేయకుండా క్రీడా పోటీల్లోనూ రాణిస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, వ్యాయామ ఉపాధ్యాయుల మార్గదర్శకంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో పలువురు క్రీడాకారులు 'న్యూస్‌టుడే'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు. ఆ వివరాలు..

ఆరేళ్లుగా సాధన



జగిత్యాలకు చెందిన పూరెళ్ల కావ్యశ్రీకి మొదటి నుంచి క్రీడలంటే మక్కువ. బాస్కెట్‌బాల్ క్రీడలో ప్రత్యేకత సాధించింది. కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. తండ్రి శ్రీనివాస్‌గౌడ్ వ్యాపారి కాగా, తల్లి లావణ్య గృహిణి. ఆరేళ్లుగా నిత్యం ఉదయం, సాయంత్రం గంటన్నర చొప్పున క్రమం తప్పకుండా సాధన చేస్తోంది. పీఈటీల నుంచి మెలకువలు నేర్చుకొని పదిసార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఒకసారి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన కావ్యశ్రీ జట్టును ముందు వరుసలో నిలపడంలో కీలక పాత్ర పోషించింది. సివిల్స్ సాధించడమే లక్ష్యమని పేర్కొంది.

ఐపీఎస్‌గా సేవ చేస్తా



జగిత్యాల పట్టణం పోచమ్మవాడకు చెందిన కొక్కు మణికంఠ బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణిస్తున్నాడు. తండ్రి లక్ష్మణ్ ప్రైవేటు ఉద్యోగి కాగా తల్లి భాగ్యలక్ష్మి బీడీలు చేస్తూ కుటుంబానికి అండగా ఉంటోంది. కరీంనగర్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతూ బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణిస్తున్నాడు. నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా సాధన చేస్తూ బాస్కెట్‌బాల్ క్రీడపై పట్టు సాధిస్తున్నాడు. ఒకసారి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న మణికంఠ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఎన్‌సీసీ క్యాడెట్‌గా చదువుకుంటూనే భవిష్యత్తులో ఐపీఎస్ అధికారిగా సమాజానికి సేవ చేస్తానని చెప్పాడు.

చదువుతోపాటు క్రీడలు



జగిత్యాలకు చెందిన చెన్నాడి శరణ్య చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతోంది. హైదరాబాద్‌లోని సీబీఎస్‌ఈ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శరణ్య బాస్కెట్‌బాల్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎదిగింది. తండ్రి సత్తిరెడ్డి మండల దుకాణం నిర్వహిస్తుండగా, తల్లి మధురిమ గృహిణి. వ్యాయామ ఉపాధ్యాయుల మార్గదర్శకంలో రెండు పూటలా సాధన చేస్తూ పట్టు సాధిస్తోంది. ఆరు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరచడంతో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో అవకాశం దక్కించుకొని ప్రతిభ చాటింది. ఇండస్ట్రియల్ విభాగంలో ప్లాంట్ ఇంజినీర్‌గా స్థిరపడటం లక్ష్యమని పేర్కొంది.

ఐపీఎస్ లక్ష్యం



జగిత్యాల పట్టణానికి చెందిన చంద్రపల్లి కారుణ్య సిరియ బాస్కెట్‌బాల్ పోటీల్లో తన కంటూ ప్రత్యేకతను చాటుతోంది. హైదరాబాద్ కోఠి మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ రెండో సంవత్సరం చదువుతోంది. తల్లి ఎస్తేరురాణి ప్రైవేటు ఉపాధ్యాయురాలిగా కుటుంబాన్ని పోషిస్తోంది. నిత్యం మూడు గంటల పాటు సాధన చేస్తూ ఆటపై పట్టు సాధిస్తోంది. పన్నెండు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడమే కాకుండా, జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచింది. ఐపీఎస్ అధికారిగా రాణించడం లక్ష్యమని చెప్పింది.

అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తా



జగిత్యాల పట్టణంలో తొమ్మిదో తరగతి చదువుతున్న తుంగతుర్తి సంజనకు బాల్యం నుంచే క్రీడలంటే అమితమైన ఆసక్తి. తండ్రి రవీందర్‌రావు ప్రైవేటు ఉపాధ్యాయుడు కాగా తల్లి త్రివేణి గృహిణి. ఇద్దరి ప్రోత్సాహంతో బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణిస్తోంది. ప్రతి రోజు మూడు గంటల పాటు సాధన చేస్తూ పట్టు సాధిస్తోంది. ఒకసారి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడంతో పాటు పదిసార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచింది. అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తానని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేసింది.

ఉమ్మడి జిల్లా డీడీవోపీగా శరత్



కరీంనగర్ న్యాయవార్తలు, న్యూస్‌టుడే: కరీంనగర్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ధరావత్ శరత్‌ను తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వారు నియమించారు. శరత్ గతంలో హుజూరాబాద్ అసిస్టెంట్ సెషన్ కోర్టులో అదనపు పీపీగా బాధ్యతలు నిర్వర్తించి, పదోన్నతిపై కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జి కోర్టుకు బదిలీ అయ్యారు. ఇకపై శరత్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాసిక్యూటర్ల పరిపాలన బాధ్యతలు చూస్తారు. మహబూబ్‌నగర్ ఎస్సీ, ఎస్టీ కోర్టు ఏపీపీగా ఉన్న రామ్‌బక్ష్ పదోన్నతిపై కరీంనగర్ జిల్లా కోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బదిలీ కాగా ఆయన మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. హుజూరాబాద్ అసిస్టెంట్ సెషన్ కోర్టుకు ఇన్‌ఛార్జి అదనపు పీపీగా గౌరు రాజిరెడ్డి బాధ్యతలు చేపట్టారు.

పోక్సో కోర్టు పీపీగా కుమారస్వామి



కరీంనగర్ న్యాయవార్తలు, న్యూస్‌టుడే: కరీంనగర్ జిల్లా కోర్టులోని మొదటి పోక్సో (బాలికలపై అత్యాచారాలను నిరోధించడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన న్యాయస్థానం) కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, న్యాయవాది పంజాల కుమారస్వామిని నియమిస్తూ రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. అక్కన్నపేట మండలం అంతక్కపేట గ్రామానికి చెందిన కుమారస్వామి రైతు కుటుంబం నుంచి వచ్చారు. జిల్లా కోర్టులో 2005 నుంచి న్యాయవాదిగా కొనసాగుతున్నారు. ఈయన నియామకంపై పలువురు న్యాయవాదులు హర్షం వెలిబుచ్చారు.

నేడు ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలు



కరీంనగర్ కొత్తపల్లి, న్యూస్‌టుడే: కరీంనగర్, జగిత్యాల బాక్సింగ్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో బుధవారం కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ జిల్లాల అసోసియేషన్ కార్యదర్శులు సంపత్‌కుమార్, జి.శ్రీనివాస్ తెలిపారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, ఫొటో, పుట్టినరోజు ధ్రువీకరణ పత్రంతో ఉదయం 8 గంటలలోపు హాజరుకావాలని సూచించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులు ఈనెల 5, 6న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఎంగిలి పూల బతుకమ్మకు సర్వం సిద్ధం

ఒక్కేసి పువ్వేసి చందమామా.. అంటూ పూలతో తొమ్మిది రోజులు సందడి చేసే పూల పండుగ బతుకమ్మ రానే వచ్చింది. ఆడపడచుల సంబురమిది. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చుకొని మనసారా కొలుస్తూ ఆటాపాటలతో ఉత్సాహంగా గడుపుతారు. మహాలయ అమావాస్యతో ఎంగిలి పూల బతుకమ్మతో మొదలై దుర్గాష్టమితో నవరాత్రులతో ముగిసే పండుగే బతుకమ్మ. బుధవారం ఊరూరా. . వాడవాడలో ఆడుకొనేందుకు రెండ్రోజుల నుంచే పూల సేకరణతోపాటు ఇతరాత్ర ఏర్పాట్లతో ఇళ్లల్లో సందడి కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బుధవారం ఎంగిలి బతుకమ్మ వేడుకలను బ్రహ్మాండంగా నిర్వహించుకునేలా కూడళ్లను చదును చేశారు. లైటింగ్ సౌకర్యాలు కల్పించారు. ఇప్పటికే గ్రామీణ శ్రామికులు పూలను సేకరించి నగరంలో అన్ని ప్రధాన రహదారులతోపాటు మార్కెట్ రోడ్డులో విక్రయాలతో రహదారులు కిటకిటలాడాయి.

- న్యూస్‌టుడే, కరీంనగర్ సాంస్కృతికం



కరీంనగర్ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న అధ్యాపకులు, విద్యార్థినులు

నేడు జమ్మికుంట మార్కెట్‌కు సెలవు

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం 35 ట్రాలీల కొత్తపత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. బిడ్డింగ్‌లో క్వింటాకు కనిష్ఠంగా రూ.6,000 గరిష్ఠంగా రూ.6,800 ధర పలికింది. 83 క్వింటాళ్ల బస్తాల కొత్తపత్తిని రూ.5,500 నుంచి రూ.6,700 దాకా వ్యాపారులు ఖరీదు చేశారు. సోమవారం కంటే తాజాగా కొత్తపత్తి ధర రూ.100 పెరిగింది. బిడ్డింగ్‌ను మార్కెట్ కార్యదర్శి మల్లేశం పరిశీలించారు. గాంధీ జయంతి, అమావాస్య సందర్భంగా బుధవారం మార్కెట్‌కు సెలవు అని ఆయన తెలిపారు.

గణనీయంగా సన్నాల సాగు



హుజూరాబాద్ ప్రాంతంలో ఎండాకు తెగులు సోకిన వరిపంట

ఈనాడు, సిరిసిల్ల

న్యూస్‌టుడే, జగిత్యాల ధరూర్‌క్యాంపు

ఉమ్మడి జిల్లాలో రికార్డుస్థాయిలో వరి విస్తీర్ణం

వ్యవసాయశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం ఉమ్మడి జిల్లాలో ఈ వానాకాలం రికార్డుస్థాయిలో వరి సాగులో కిరాగా సన్నగింజ రకాల సాగు భారీగా పెరిగింది. నిరుడు 9.60 లక్షల ఎకరాల్లో ఈ సీజన్‌లో 9.82 లక్షల ఎకరాల్లో వరిపంటను రైతులు సాగుచేశారు. ప్రస్తుతం జగిత్యాల జిల్లాలో మొత్తం వరి సాగు 3.16 లక్షల ఎకరాలు కాగా కరీంనగర్ 2.76, పెద్దపల్లి 2.09, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1.81 లక్షల ఎకరాలుగా నమోదైంది. నాలుగు జిల్లాల్లో 6.06 లక్షల ఎకరాల్లో దొడ్డుగింజ రకాలుండగా 3.76 లక్షల ఎకరాల్లో సన్నగింజ రకాలున్నట్లు అధికారులు గుర్తించారు.


గతంలో ఉమ్మడి జిల్లాలో సన్నాలసాగు లక్ష ఎకరాల్లోపే ఉంటుండగా ఈ సారి రాష్ట్రప్రభుత్వం సన్నగింజ రకాలకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తామనటంతో సన్నాల సాగువిస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం సేకరించే సన్నగింజ రకాల పేర్లను ఆలస్యంగా వెల్లడించటం, కేవలం వ్యవసాయ వర్సిటీల్లో రూపొందించిన రకాలనే కొనుగోలు చేస్తామనటం, ప్రభుత్వం సూచించిన రకాల విత్తనాలు లభించకపోవటం, సన్నాల సేకరణ, బోనస్ చెల్లింపుపై అనుమానాలతో చాలామంది రైతులు దొడ్డుగింజ రకాలనే సాగుచేశారు. ప్రభుత్వం ముందుగా రకాలు, సేకరణపై స్పష్టమైన ప్రకటన చేసి ఉంటే సన్నాలసాగు మరో లక్షన్నర ఎకరాలకుపై పెరిగే అవకాశముండేది. ప్రస్తుతం ఫైన్ రకాలకు క్వింటాలుకు రూ.2,320, కామన్ రకాలకు రూ.2,300 ధరుండగా సన్నగింజ రకాలకు ఈ ధరకన్నా క్వింటాలుకు రూ.500 అదనంగా బోనస్ చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. ప్యాక్స్, ఐకేపీ, డీసీఎంఎస్, రైతుసంఘాలు, ఎఫ్‌పీవోలు తదితరాల ద్వారా ఉమ్మడి జిల్లాలో దాదాపుగా 1,370 కిపైగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనుండగా సన్నగింజ, లావుగింజ రకాలకు వేరువేరు కేంద్రాల ద్వారా దాదాపుగా 18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించనున్నారు. ముందుగా నాటిన వరిపైరు గొలకదశలో ఉండగా వరి నూర్పిడులను బట్టి అక్టోబరు మొదటి వారం నుంచి కేంద్రాలను తెరచి ధాన్యం సేకరణ చేపట్టనున్నారు. అయితే గాలివానతో గొలకదశలోని వరిపైరు పడిపోవటం, ప్రతికూల వాతావరణంతో సన్నగింజ రకాల్లో చీడపీడల తీవ్రత పెరగటం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

చీడపీడల వ్యాప్తికి అనుకూలం - వాణి, జిల్లా వ్యవసాయాధికారిణి, జగిత్యాల



ఈ సీజన్‌లో సన్నగింజ రకాల సాగు గణనీయంగా పెరిగింది. విస్తారంగా వర్షాలు కురిసి ఒక్కసారిగా ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు, ఉక్కపోత వాతావరణం చీడపీడల వ్యాప్తికి అనుకూలంగా మారింది. సన్నరకాల్లో సుడిదోమలు, తెగుళ్ల తీవ్రత ఎక్కువగా ఉండి దిగుబడులను ప్రభావితం చేసే అవకాశమున్నందున పంటపై ఏవేని అసహజ లక్షణాలుంటే అధికారులు లేదా శాస్త్రవేత్తలతో నిర్ధారించుకుని నివారణ చేపట్టాలి.

దిగుబడులపై ప్రభావం - డాక్టర్ టి.కిరణ్‌బాబు, వ్యవసాయ వర్సిటీ ప్రధాన శాస్త్రవేత్త



బ్యాక్టీరియా ఎండాకు తెగులు నివారణకు కాపర్ హైడ్రాక్సైడ్ 2 గ్రాములు, స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ 0.4 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఎకరాకు 15-20 కిలోల పొటాష్‌ను వేయాలి. సుడిదోమల వ్యాప్తి నిరోధానికి యూరియాను ఎకరాకు 20-25 కిలోలే చల్లాలి. దోమల తీవ్రతను బట్టి పొలాన్ని ఆరగట్టాలి, తొలిదశలో బ్యుప్రొఫెజిన్ 1.6 మి.లీ లేదా ఎసిఫేట్ ఇమిడాక్లోప్రిడ్ మిశ్రమ మందు 1.5 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. మొదళ్లపై దోమలు ఎక్కువుంటే డైనోటెఫ్యూరాన్ 0.4 గ్రాములు లేదా పైమెట్రోజైన్ 0.6 గ్రాములు ట్రైఫ్లూమెజోఫైరిమ్ 0.48 మి.లీ లేదా ఎథిప్రోల్ ఇమిడాక్లోప్రిడ్ 0.25 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పొలాన్ని పాయలుగాచేసి మందుద్రావణం మొక్కల మొదళ్లపై పడేలా పిచికారీ చేయాలి.

నవోదయ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం




చొప్పదండి, న్యూస్‌టుడే: చొప్పదండి నవోదయ పాఠశాలలో 9,11 తరగతుల్లో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ మంగతాయారు మంగళవారం ప్రకటనలో కోరారు. 2025-26 సంవత్సరానికిగాను 8వ తరగతి చదువుతున్నవారు 9వ తరగతికి, పదో తరగతి చదువుతున్న వారు 11వ తరగతికి ఈనెల 30 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 8న పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

5 నుంచి బీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న బీఈడీ నాలుగో సెమిస్టర్ (రెగ్యులర్, బ్యాక్‌లాగ్) పరీక్షలు ఈనెల 5 నుంచి ప్రారంభమవుతున్నట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

కరీంనగర్ క్రికెట్ జట్టు శుభారంభం



కరీంనగర్ కొత్తపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో జరిగిన ఉమ్మడి అంతర్ జిల్లాల అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో ఖమ్మం జిల్లా జట్టుపై కరీంనగర్ జిల్లా జట్టు ఘన విజయం సాధించింది. కరీంనగర్ జట్టు తరఫున తక్షిల్ 51 పరుగులు, రిత్విక్ 33 పరుగులు, బౌలింగ్‌లో అర్షద్ 4 వికెట్లు, విగ్నేష్ 3 వికెట్లు, వంశీ 2 వికెట్లు సాధించారు. అర్షద్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైనట్లు టీం మేనేజర్, జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.మనోహర్‌రావు, తెలిపారు. జట్టు క్రీడాకారులను జిల్లా అధ్యక్షుడు వి.ఆగంరావు, శరత్, తదితరులు అభినందించారు.

యువకుడి దారుణ హత్య

కుటుంబ కలహాలే కారణమా?



విద్యాసాగర్‌రాజు

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : జగిత్యాల గ్రామీణ మండలం అంతర్గాంలో మంగళవారం రాత్రి ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. కుటుంబసభ్యులు కనిపించకుండా పోవడంతో కుటుంబ కలహాలే హత్యకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ కథనం మేరకు.. అంతర్గాంకు చెందిన నన్నపనేని విద్యాసాగర్‌రాజు (35) కొన్నాళ్లు గల్ఫ్‌కు వెళ్లి వచ్చాడు. అవివాహితుడైన ఇతను తల్లిదండ్రులు, సోదరుడు విక్రమ్‌రాజు కుటుంబంతో కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నాడు. ఏ పని చేయకుండా జులాయిగా తిరుగుతుండటంతో కుటుంబంలో కలహాలు చోటుచేసుకుంటున్నాయని సమాచారం. మంగళవారం సాయంత్రం ఇంట్లో గొడవ జరిగింది. కొద్దిసేపటికి సందడి లేకపోవడంతో స్థానికులు వెళ్లి చూడగా ఇంటి ఆవరణలో రక్తపు మడుగులో పడి ఉన్న విద్యాసాగర్‌రాజు మృతదేహం కనిపించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారమిచ్చారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సదాకర్ మృత దేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. విద్యాసాగర్‌రాజు తల, మెడపై తీవ్ర గాయాలున్నాయి. పోలీసుల విచారణ సమయంలో అక్కడికి వచ్చిన విక్రమ్‌రాజు తరవాత అక్కడి నుంచి వెళ్లిపోయాడు. విద్యాసాగర్‌రాజు తల్లిదండ్రులు, విక్రమ్‌రాజు భార్య, ఏడాదిన్నర కుమారుడు ఎవరూ ఇంట్లో లేకపోవడంతో కుటుంబ కలహాలే హత్యకు కారణమని అనుమానాలు ఉన్నాయని డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.